జాతీయ జెండా పండుగకు సర్వం సిద్ధం



త్రివర్ణ రంగులతో శోభిల్లుతున్న నగరపాలక సంస్థ కార్యాలయం



నేతన్న సర్కిల్ వద్ద ప్రజలకు త్రివర్ణ పతాకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: జాతీయ జెండా పండుగ సందర్భంగా దేశ భక్తిని చాటుకునేందుకు నగర ప్రజలు సర్వం సిద్ధమయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు గౌతమ బుద్దా రోడ్డు సెంట్రల్ డివైడర్ మధ్య విద్యుత్ స్తంభాలు, పలు కార్యాలయాలకు త్రివర్ణ రంగులతో విద్యుత్ కాంతులీనుతున్నాయి. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించి తమ దేశభక్తిని చాటుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజలకు త్రివర్ణ పతాకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే

సందర్భంగా నగరంలోని నేతన్న సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వంద అడుగుల జెండా వద్ద ప్రజలకు సోమవారం త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా ప్రజలందరి పండుగ అయిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. ఒక్క పంద్రాగస్టునే కాకుండా ప్రతి రోజూ జాతీయ జెండాను గౌరవించుకోవడంతోపాటు మహనీయుల త్యాగాలను స్మరించుకుని భావితరాలకు స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను తెలియజేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు జాతీయ రహదారి నేతన్న సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డితో కలసి ఆవిష్కరించనున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, నగరపాలక సంస్థ కార్యాలయం, మార్కెట్ యార్డు కార్యాలయంలో జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

యువగళంకు నిరసన సెగ

తాడేపల్లిలో మహిళల ఆందోళన



మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తూ సెంటు స్థలం కేటాయించి ఇళ్లు నిర్మాణం చేసుకునే సమయంలో టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని మహిళలు నిలదీస్తున్నారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను నిరసిస్తూ తాడేపల్లి ముగ్గురోడ్డులోని పలువురు లబ్ధిదారులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కోర్టులకు వెళ్లి పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్న నారా లోకేష్ ఏ మొహం పెట్టుకుని పాదయాత్ర చేస్తారని నిలదీసారు. రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్లు ఉండకూడదు, పేదలు నివశించకూడదని చెబుతున్న చంద్రబాబు, నారా లోకేష్‌లు పేద వారి ఓట్లు మాత్రం కావాలా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు మనస్సు మార్చుకుని పేదల ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని, లేదంటే 2024లో జరుగబోయే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. లోకేష్ పాదయాత్రలో ఖచ్చితంగా పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడంపై నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదిగొండ ప్రకాష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బ్యానర్లు ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు



తాడికొండ: యువగళం పాదయాత్రలో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండు రోజులపాటు తాడికొండ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ 'మా నమ్మకం నువ్వేజగన్' పేరుతో ఉన్న ఫ్లెక్సీ హోర్డింగ్ ధ్వంసం చేసి పక్కన పడేశారు. ఫ్లెక్సీలు చించివేశారు. దీంతో సంయమనం పాటించిన వైఎస్సార్ సీపీ నేతలు రెండోరోజు తిరిగి వాటిని ఏర్పాటు చేశారు. మళ్లీ అదేరీతిలో వ్యవహరించిన టీడీపీ నేతల పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల్లో విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న వినియోగదారులతోపాటు అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగించుకుంటున్న పలువురు గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 79 మందిని గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.6,70,300 అపరాధ రుసుం వసూలు చేయాలని నిర్ణయించినట్లు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ ఈఈలు సీహెచ్ రాంబొట్లు, కేవీఎల్ఎన్ మూర్తిల ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో డీఈఈలు అక్కల సత్యనారాయణ కేవీ కోటేశ్వరరావులతో పాటు పలువురు ఏఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కేఎల్‌యూని సందర్శించిన స్టెల్లా కళాశాల విద్యార్థులు



స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి డాక్టర్ జి సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: శాస్త్రీయ అన్వేషణ, సాంకేతిక పురోగతిలో మెటీరియల్ సైన్స్ తదితర విభాగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడుతుందని భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కోనేరు స్వప్న అన్నారు. సోమవారం విజయవాడ స్టెల్లా కళాశాల విద్యార్థులు కేఎల్ యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీలోని అత్యాధునిక మెటీరియల్స్ గ్లాస్, నానో సైన్స్ పరిశోధనా విభాగాలను సందర్శించగా ఆయా విభాగాల హెచ్‌ఓడీలు వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్మిషన్ల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ షణ్ముక్, వీసీ డాక్టర్ జి పార్థసారధి వర్మ, ప్రో వీసీలు, ఛాన్సలర్లు, డాక్టర్లు ఏవీఎస్ ప్రసాద్, ఎస్ వెంకట్రామ్, కె సుబ్బారావు, ఎ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సు

యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరుకోవాలే గానీ ఉద్యోగాల కోసం తిరిగే విధంగా ఉండకూడదని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు అన్నారు. సోమవారం యూనివర్సిటీ ఆవరణలో వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి సతీష్‌కుమార్ జీ మాట్లాడారు.కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, ప్రొఫెసర్ సుబ్రమణ్యం, సైకాలజిస్ట్ విజయరత్నం, సాక్ కోచ్ బికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవికి రాజకీయ భవిష్యత్‌నిచ్చిన జగన్

జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: వైద్య వృత్తిలో ఉన్న ఉండవల్లి శ్రీదేవికి రాజకీయ భవిష్యత్ నిచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ భవిష్యత్ నిచ్చిన జగన్‌మోహన్ రెడ్డిని మరిచి ప్రతిపక్ష నాయకులతో చేతులు కలపడం అన్యాయం అన్నారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకుని అవినీతి అక్రమాలకు పాల్పడిన విషయం ప్రజలకు తెలుసునన్నారు. పదవులు ఇచ్చేందుకు బడుగు, బలహీనవర్గాల వారివద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం నిజంకాదా అని ప్రశ్నించారు. పదవి ఇచ్చేందుకు నన్నే వారం రోజులు తిప్పుకున్నావని, చివరకు ముఖ్యమంత్రి చొరవతో జెడ్పీటీసీ టికెట్టు పొంది గెలుపొందానని అన్నారు. చంద్రబాబు, లోకేష్ రక్షణ కల్పించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ధైర్యం ఉంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలుపొందిన నీవు రాజీనామ చేయాలని డిమాండు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి పి.జేమ్స్ ఇన్నయ్య మాట్లాడుతూ ఉండవల్లి శ్రీదేవి అవినీతిపై పుస్తకాన్ని ప్రచురించి విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ నుంచి శ్రీదేవి పోటీ చేసినా నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ఓడిస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, డి.సురేష్, పి.రఘు, ఎం.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.కమల్‌ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. బాలికల పరుగు పోటీలో ప్రథమస్థానంలో షేక్ మల్కాఆరిఫా నిలువగా, ద్వితీయస్థానంలో షేక్ తస్మియా నిలిచారాన్నరు. బాలుర విభాగంలో ప్రథమస్థానంలో షేక్ మౌలాలీ, ద్వితీయ స్థానంలో షేక్ అబూబకర్ సిద్ధిఖ్ నిలిచారని చెప్పారు. లాంగ్‌జంప్‌లో మూడువిభాగాల్లో పోటీలు నిర్వహించామని విజేతలకు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాజీరాబేగం, ఉపాధ్యాయులు థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై బురదచల్లే కార్యక్రమం

- లోకేష్ పాదయాత్రకు నిరసనగా నల్లజెండాలు ప్రదర్శన
- నల్ల బెలూన్లతో నిరసన తెలియజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడికొండ: లోకేష్, ఉండవల్లి శ్రీదేవిలు యువగళం పాదయాత్ర పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదచల్లే కార్యక్రమం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్ మండిపడ్డారు. లోకేష్ తాడికొండ నియోజకవర్గంలో చేస్తున్న పాదయాత్రకు నిరసనగా తుళ్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్, తుమ్మూరు రమణారెడ్డిలు నల్ల జెండాలు, నల్లబెలూన్లతో నిరసన తెలియజేశారు. తొలుత పాదయాత్రను అడ్డుకునేందుకు వారు అడ్డరోడ్డు వద్దకు వెళ్లగా పోలీసులు అడ్డుకొని తుళ్లూరు తరలించారు. వారు మాట్లాడుతూ లోకేష్ మాట్లాడుతూ అమరావతి అందరి రాజధాని అని చెబుతున్నాడని ఇది చాలా సిగ్గుచేటని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఈ ప్రాంతంలో 52 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చి నివాసాలు కల్పిస్తుంటే వాటికి వ్యతిరేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లి అమరావతిలో పేదలు ఉండటానికి వీల్లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య ఒక్కటే మనిషిని ఉన్నత స్థానాలకు చేరుస్తుంది

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- సొంత నిధులు వెచ్చించి సైకిళ్లు పంపిణీ



మంగళగిరి: విద్య ఒక్కటే సమాజంలో మనిషిని ఉన్నతస్థానాలకు చేర్చడంతో పాటు గౌరవాన్ని పెంచుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తమ సొంత నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఇప్పటికే దుగ్గిరాలలో విద్యార్థులకు సైకిళ్లను అందజేశామని, నగరంలోను అవసరమైన ప్రతి విద్యార్థికి సైకిళ్లను అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు దూరంగా ఉండి నడిచి రావడానికి ఇబ్బందులు పడే విద్యార్థులను గుర్తించి వారికి సైకిల్‌ను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు సంకె సునీత, కలకోటి స్వరూపరాణి, మల్లవరపు సుధారాణి, ఎండీ ఫిరోజ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.6.30 లక్షలు మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీసీ డీఎం మంత్రూ నాయక్

మంగళగిరి: వేసిన తాళం వేసినట్లు ఉన్నా లాకర్‌లో నగదు మాయం ఆర్టీసీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.6,30,938 చోరీకి గురైనట్లు ఆర్టీసీ డీఎం మంత్రూ నాయక్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక రోజు వచ్చిన ఆదాయాన్ని మరుసటి రోజు బ్యాంకులో జమ చేస్తుంటారు. ఈ నెల 11వ తేదీ శుక్రవారం వచ్చిన ఆదాయాన్ని లాకర్‌లో దాచారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో ఆ రెండు రోజులు వచ్చిన ఆదాయం మొత్తం కలిపి రూ.6,30,938 ఆదివారం రాత్రి లాకర్‌లో దాచారు. సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న డీఎం, అధికారులు లాకర్‌లోని నగదును బ్యాంకులో జమ చేసేందుకు చూడగా నగదు మాయమైనట్లు గుర్తించారు. వేసిన తాళం వేసినట్లే ఉండగా నగదు మాయంపై ఆర్టీసీ వర్గాలు విస్మయ వ్యక్తం చేస్తున్నాయి. విచారణ చేపట్టిన డీఎం సాయంత్రం వరకు నగదు విషయం తేలకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అధికారుల అనుమతి లేకుండా ఫ్లెక్సీలు

అడ్డుకున్న అధికారులపై టీడీపీ నాయకుల జులుం

మంగళగిరి: టీడీపీ నాయకుడు లోకేష్ పర్యటన సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికారుల అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు నగరపాలక సంస్థ అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అనుమతి తీసుకోకపోగా పాత బస్టాండ్ సెంటర్ నుంచి రోడ్లకు అడ్డుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలువురు వాహనదారులు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు ఫ్లెక్సీలు తొలగించారు. ఫ్లెక్సీల తొలగింపును నిరసిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగడమే కాకుండా అధికారులపై జులుం ప్రదర్శించారు. అధికారుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని చర్చలు జరిపారు. దీంతో అధికారులు నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకుని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించడంతో ఆందోళన విరమించి వెనుదిరిగారు.